
ప్రజాశక్తి

శనివారం 21 జూన్ 2025 5

పార్వతీపురం మన్యం



సిఆర్‌టిల రెన్యువల్ ఉత్తర్వులపై హర్షం

ప్రజాశక్తి-పార్వతీపురం

గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న 1300 సిఆర్‌టిల రెన్యువల్‌కు జిఒ నెంబర్ 92 జారీ చేయడం పై యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్ రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 12 నుంచి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు ప్రారంభం కావడంతో ఉపాధ్యాయులు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే సిఆర్‌టిల రెన్యువల్ ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు.



ఇటీవల పార్వతీపురం పట్టణంలో సరఫరా అయిన బురదనీరు (ఫైల్)

నియోజకవర్గ అభివృద్ధి విషయంలో స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర చెప్పింది కొండంత.. చేసింది గోరంతగా కనిపిస్తోంది. మూడడుగుల ముందుకు, ఆరడుగుల వెనక్కి అన్న చందంగా నియోజకవర్గం నడుస్తోంది. గత ఎన్నికల ముందు టిడిపి అభ్యర్థిగా బోనెల విజయ్‌చంద్ర నియోజకవర్గ ప్రజలకు బోలెడన్ని హామీ లిచ్చారు. అవినీతిపరుల అంతు చూస్తానని, పట్టణంలో జరిగిన భూకబ్జాల సంగతి తేలుస్తానని ఎన్నికల ప్రచారంలో ఉపన్యాసాలు ఇచ్చారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. కానీ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన కీలకమైన సమస్యలేవీ పరిష్కారానికి నోచుకోలేదు. ఆ దిశగా అడుగులు వేస్తున్న దాఖలాలు కూడా లేవు.

- ఎమ్మెల్యే ఏడాది పాలనలో అభివృద్ధి శూన్యం
- కదలని జంఝావతి ప్రాజెక్టు
- పట్టణ వాసులకు సురక్షిత తాగునీరు కరువు
- భూకబ్జాలపై ఆరంభ శూరత్వమే

చెప్పింది కొండంత చేసింది గోరంత

ప్రజాశక్తి-పార్వతీపురం

పార్వతీపురం నియోజకవర్గం ప్రధానంగా వ్యవసాయ ఆధారిత ప్రాంతం. గత 45 సంవత్సరాలుగా ఈ ప్రాంత రైతులు జంఝావతి ప్రాజెక్టు నిర్మాణంపై ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వాలెన్ని మారినా నియోజకవర్గ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాల్సిన జంఝావతి ప్రాజెక్టు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మిగిలింది. పట్టణ ప్రజలు గత కొంతకాలంగా తీవ్రమైన తాగునీటి సమస్యని ఎదుర్కొంటున్నారు. తోటపల్లి జలాశయం నుంచి తాగునీటి సరఫరా చేసే ప్రాజెక్టు రూపకల్పన చేసి సంవత్సరాలు గడిచినా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. పురాతన పైపులైన్ వ్యవస్థ ఉండడంతో పట్టణ ప్రజలు కలుషిత తాగునీటినే వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కలగా మిగిలిన జంఝావతి ప్రాజెక్టు

గత ఎన్నికల ముందు ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర గ్రామాల్లో తిరుగుతూ గొప్పగొప్ప హామీనిచ్చారు. నియోజకవర్గ రైతులకు జీవనాధారమైన జంఝావతి ప్రాజెక్టు నిర్మాణానికి కృషి చేస్తానని చెప్పారు. సుమారు 24 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సిన ప్రాజెక్టు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ఒడిశాతో ఉన్న జలవివాదాన్ని పరిష్కరించేందుకు ప్రభుత్వ స్థాయిలో చొరవ చూపించాల్సి ఉంది. ఇది జరగాలంటే స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయింపు చేయించాలి.

బురదనీరే గతి

నియోజకవర్గ, జిల్లా కేంద్రమైన పార్వతీపురం పట్టణంలో ప్రజలు బురద నీటినే వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వం హయాం నుంచి పట్టణ ప్రజలు తీవ్ర తాగునీటి సమస్యని ఎదుర్కొంటున్నారు. తోటపల్లి జలాశయం నుంచి తాగునీటి సరఫరా చేసే ప్రాజెక్టు నిర్మాణానికి సుమారు రూ.63 కోట్లు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు. దీంతో ప్రజలకు వారానికి ఒకసారి మాత్రమే తాగునీరు సరఫరా చేయాల్సి వస్తోంది. పురాతన పైపులైన్ వ్యవస్థ కారణంగా లీకేజీల వల్ల నీరు కలుషితమవుతోంది. ఆ కలుషిత తాగునీటినే ప్రజలు వినియోగిస్తున్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా తాగునీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర కనీసం చొరవ చూపిన దాఖలాలు లేవు.

భూకబ్జాలపై ఆరంభ శూరత్వమే

గత ప్రభుత్వం హయాంలో పట్టణంలోని ప్రధాన చెరువులు, కాలువలు ఆక్రమణకు గురయ్యాయి. ప్రభుత్వ చెరువులు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కాసులు కురిపించే కామధేనువులుగా మారాయి. గత ఎన్నికలతోనే రాజకీయ అరంగేట్రం చేసిన ఎమ్మెల్యే బోనెల యువకుడు, విద్యావంతుడు కావడంతో ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. నియోజకవర్గ సమస్యలు పరిష్కారానికి చొరవ చూపుతారని భావించారు. కానీ గత ఏడాది కాలంలో ఆయన పనితీరు ఆశాజనకంగా లేకపోవడంతో జనం తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. గతంలో జరిగిన భూ ఆక్రమణలు, కబ్జాలపై ఆయన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కబ్జాదారులతో ఆయన అవగాహనకు వచ్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గడచిన ఏడాది కాలంలో కూడా పట్టణంలో భూ ఆక్రమణలు జరుగుతున్నాయి. అయినా ఆయన స్పందించిన పరిస్థితి కనిపించడం లేదు.



మూతపడిన చక్కెర ఫ్యాక్టరీ

సీతానగరం మండలంలోని ఎన్‌సిఎస్ చక్కెర ఫ్యాక్టరీ మూతపడటంతో ఈ ప్రాంత చెరకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పండించిన చెరకు పంటను సుదూర ప్రాంతంలో ఉన్న సంకిలి ఫ్యాక్టరీకి రవాణా చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఫ్యాక్టరీ మూసివేయడంతో వందల మంది ఉపాధి కోల్పోయారు. ఫ్యాక్టరీ తెరిపించేందుకు ఏడాది కాలంలో ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర చేసిన కృషి కనిపించడం లేదు.



యోగాంధ్రకు పార్వతీపురం డిపో నుంచి కేటాయించిన బస్సులు

యోగాంధ్రకు 165 బస్సులు

మీరు ఈరోజు ఎక్కడికైనా వెళ్లాలనుకుంటున్నారా? అందుకోసం బస్సుల్లో ప్రయాణించాలని భావిస్తున్నారా? అయితే కాస్త ఆగండి! ఓసారి ప్రయాణం గురించి ఆలోచించుకోండి. సమయానికి బస్సు అందుబాటులో లేకపోవచ్చు. రాకపోవచ్చు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయివేటు వాహనాలను ఆశ్రయించాల్సి రావచ్చు. ఎందుకంటారా? విశాఖలోని నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమానికి భారీ సంఖ్యలో ఆర్‌టిసి బస్సులను మళ్లించడమే కారణం. ఈ నేపథ్యంలో శుక్రవారం నుంచే ప్రయాణికులకు కష్టాలు కూడా మొదలయ్యాయి.

ప్రజాశక్తి-పార్వతీపురం

విశాఖపట్నంలో శనివారం నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమానికి జనాలను తరలించేందుకు జిల్లా నుంచి 60 శాతం ఆర్‌టిసి బస్సులను మళ్లించారు. దీంతో శుక్రవారం మధ్యాహ్నం నుంచే ప్రయాణికులకు రవాణా కష్టాలు మొదలయ్యాయి. ప్రధాని మోడీ హాజరు కానున్న ఈ కార్యక్రమానికి ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు గోదావరి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు, ఆసక్తి కలిగిన ప్రజలను తరలించే ప్రయత్నంలో అధికారులు ఉన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి రికార్డు స్థాయిలో జనాలతో నిర్వహించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు పెద్ద ఎత్తున ఆర్‌టిసి డిపోల నుంచి బస్సులు, ప్రయివేటు విద్యాసంస్థల బస్సులను ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా జిల్లాలోని మూడు ఆర్‌టిసి డిపోల నుంచి 60 శాతం బస్సులను యోగాంధ్రకు జనాలను తరలించేందుకు కేటాయించారు. సాలూరు ఆర్‌టిసి డిపో నుంచి 52 బస్సులు, పార్వతీపురం డిపో నుంచి 56 బస్సులు, పాలకొండ నుంచి 57 బస్సులను యోగాంధ్ర కోసం కేటాయించారు. డిపోల పరిధిలో ఉన్న మొత్తం సర్వీసుల్లో సగానికి పైగా బస్సులను తరలించడంతో సామాన్య ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం నుంచి బస్సుల కొరత వల్ల ప్రయాణికులు నానా అవస్థలు ఎదుర్కొన్నారు. శనివారం ఉదయం 5.30 గంటల నుంచి యోగాంధ్ర కార్యక్రమం ప్రారంభం కానున్న నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచే జనాలను తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. శనివారం సాయంత్రం నుంచి బస్సులు డిపోలకు చేరనున్నాయి. శుక్ర, శనివారాల్లో బస్సుల కొరత కారణంగా ప్రయాణికులు, ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కోనున్నారు.

ప్రయాణికులకు అవస్థలు

రేగులగూడలో ఏనుగుల సంచారం

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో గత రెండు రోజులుగా రేగులగూడ పరిసర ప్రాంతాల్లో ఏనుగులు తిష్టవేయడంతో గిరిజనులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే అటవీశాఖ అధికారులు అప్రమత్తం చేసినప్పటికీ ఆందోళన తప్పడం లేదు. రాత్రివేళలో ఇళ్లలోకి చొరబడతాయని ఆందోళన చెందుతున్నారు. ఆ గ్రామ సమీపం నుండి వెళ్లాలంటే ఏనుగులు దాడి చేస్తాయని వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇక రాత్రివేళ అయితే చెప్పనవసరం లేదు.



గ్రామంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు



డి పట్టా భూములను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు రెడ్డి వేణు

సాగు భూములకు పట్టాలివ్వాలని 23న ధర్నా

ప్రజాశక్తి-సీతానగరం

బగ్గందొరవలసలో డి.పట్టా భూములను సాగుచేస్తున్న దళిత, గిరిజనులకు పట్టాలివ్వాలని ఈ నెల 23న తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతున్నట్లు సిపిఎం జిల్లా నాయకులు రెడ్డి వేణు తెలిపారు. శుక్రవారం బగ్గందొరవలసలో దళిత, గిరిజనులు సాగుచేస్తున్న డి పట్టా భూములను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రెడ్డి వేణు మాట్లాడుతూ బగ్గందొరవలసలో 22 దళిత, గిరిజన కుటుంబాలకు 1972లో 16 ఎకరాల భూమికి డి.పట్టాలు ఇచ్చారని తెలిపారు. అప్పటినుండి సాగు చేస్తున్న పట్టాదారులకు హక్కులు కల్పించలేదని చెప్పారు. వారి వారసులకు పట్టాలు మంజూరు చేస్తామని 2007 భూ పోరాట సందర్భంగా ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఇంతకాలం ప్రభుత్వం స్పందించక పోవడంతో ఈ భూమిని కబ్జా చేయాలని కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు చూస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. వెంటనే దళిత, గిరిజనులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కూలీలు ఆర్.రాము, ఎం.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ ప్రతిష్టను పెంపొందించాలి

కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లా ప్రజలకు అందిస్తున్న రెవెన్యూ సేవలతో ఆ శాఖ ప్రతిష్ట మరింత పెంపొందాలని, ఆ దిశగా రెవెన్యూ శాఖాధికారులు, ఉద్యోగులు కృషి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. గ్రామ రెవెన్యూ అధికారి నుంచి తహశీల్దార్ వరకు నిబద్ధతతో పనిచేసి ప్రజలకు, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో రెవెన్యూ దినోత్సవ వేడుకలు ఆ శాఖ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. ప్రభుత్వ శాఖల్లో అన్ని శాఖల కంటే రెవెన్యూ శాఖ చాలా కీలకమైందన్నారు. ఒక్కోసారి 24/7 విధులు నిర్వర్తించవలసి ఉంటుందని అన్నారు. ఎన్నికలు, ప్రకృతి వైపరీత్యాలు, భూసేకరణ, వివిధ రకాల పత్రాలు జారీ, ప్రభుత్వ పథకాల అమలు వంటి ప్రజలకు అందించాల్సిన అన్ని సేవలు రెవెన్యూ శాఖతో ముడిపడి ఉన్నాయని చెప్పారు. రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు పనిచేయడంలో ప్రణాళిక ఉండాలని, బాధ్యతగా చేస్తే మరింత మెరుగైన సేవలు అందించవచ్చని కలెక్టర్ సూచించారు. రాబోయే రోజుల్లో ప్రతీ పని డిజిటలైజేషన్ అవుతుందని, కావున ప్రతీ ఉద్యోగి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా సేవలు అందించడం వల్ల పారదర్శకత ఉంటుందన్నారు. ప్రపంచంలో ఎక్కడి నుంచైనా తన వివరాలను తెలుసుకునే సౌలభ్యం ఉంటుందని గుర్తుచేశారు. ముఖ్యంగా రెవెన్యూ శాఖలో పనిచేసే అధికారులకు తప్పనిసరిగా రెవెన్యూ చట్టాలపై అవగాహన ఉండాలని చెప్పారు. హార్డ్ వర్క్ కాకుండా స్మార్ట్ వర్క్ చేయాలని, అప్పుడే ప్రజలకు మంచి సేవలు అందించేందుకు వీలుంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులకు ఘనంగా సత్కరించారు. కొండగొర్రి చుక్కా అలియాస్ కోనేరు అప్పారావుకు బొండేడ్ లేబర్ చట్టం ప్రకారం చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత మాట్లాడుతూ ప్రజలకు అందించే సేవల ద్వారా వారి మన్ననలను పొందాలని కోరారు.

రాష్ట్ర రెవెన్యూ శాఖ ఉపాధ్యకులు శ్రీరామమూర్తి, జిల్లా గ్రామ రెవెన్యూ సంఘం అధ్యక్షులు సింహాచలం నాయుడు, కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి సిహెచ్.రాధా కృష్ణమూర్తి తదితరులు రెవిన్యూ శాఖ అందిస్తున్న సేవలను గుర్తుచేసుకున్నారు. ఈ సమావేశంలో ఉప కలెక్టర్లు, తహశీల్దార్లు, ఉపతహశీల్దార్లు, రెవిన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూడే వేడుకల్లో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

మంత్రి దృష్టికి తాగునీటి సమస్య

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పార్వతీపురంలో తాగునీటి సమస్యను రాష్ట్ర పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి నారాయణ దృష్టికి ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర తీసుకెళ్లారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నంలో పర్యటిస్తున్న మంత్రిని శుక్రవారం ఎమ్మెల్యే విజయ్ చంద్ర కలిశారు. పార్వతీపురంలో తాగునీటి సమస్యను వివరించారు. పట్టణంలో కాలువలు, రోడ్ల నిర్మాణం సహా పట్టణాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యే ప్రతిపాదనలను విన్న మంత్రి త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కొప్పులవెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గొట్టాపు వెంకటనాయుడు పాల్గొన్నారు.



మంత్రి నారాయణతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోనెల



రహదారిపై గోతిలో దిగిపోయిన లారీ టైర్లు



నిలిచిపోయిన భారీ వాహనాలు

గోతుల్లో దిగబడిన లారీ

అంతర్రాష్ట్ర రహదారిపై భారీగా స్తంభించిన ట్రాఫిక్

ప్రజాశక్తి-కొమరాడ

పార్వతీపురం-కూనేరు అంతర్రాష్ట్ర రహదారి గోతులమయం కావడంతో మండల వాసులకు, ఆ రోడ్డు మీదుగా రాకపోకలు సాగించే వాహన దారులకు పాట్లు తప్పడం లేదు. స్వామినాయుడు వలస సమీపంలో శుక్రవారం మరోసారి భారీ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. గురువారం రాత్రి రైల్వేగేటు సమీపంలో అంతర్రాష్ట్ర రహదారిపై గోతుల్లో పార్వతీపురం నుంచి రాయగడ వైపు వెళ న్న లారీ దిగబడి, పక్కకు ఒరిగిపోయింది. దీంతో రెండు వైపుల నుంచి వాహన రాకపోకలు నిలిచిపోయాయి. సుమారు 6 కిలోమీటర్ల మేర రెండు వైపులా లారీలు, భారీ వాహనాలన్నీ నిలిచిపోయాయి. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు ఉద్యోగులు రాకపోకలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎస్ఐ నీలకంఠం జెసిబి తెప్పించి, లారీని బయటకు తీయించారు. అనంతరం రోడ్డుపై ఏర్పడిన భారీ గోతులను జెసిబితో చదును చేయడంతో భారీ వాహనాల రాకపోకలు సాగాయి. గంటల తరబడి వాహనాలు నిలిచిపోవడంతో లారీ డ్రైవర్లు ఆకలితో తీవ్ర అవస్థలు పడ్డారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి రోడ్డుపై ఏర్పడిన గోతులను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

యోగాడేకు సర్వం సిద్ధం

కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సర్వం సిద్ధమని, ప్రజలందరిని భాగస్వాములను చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పిలుపు నిచ్చారు. యోగాంధ్ర కార్యక్రమం ముందస్తు ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 5.40 లక్షల మందితో యోగా చేసేందుకు సన్నాహాలు పూర్తిచేసినట్లు చెప్పారు. విశాఖలో జరగనున్న యోగా స్ఫూర్తితో జిల్లాలో కూడా అదే సమయంలో జరగాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్దేశించిన 3,150 ప్రదేశాల్లో నేల చదును చేసి, జంగిల్ క్లియిరెన్స్ చేయించి, మ్యాట్స్ తప్పనిసరిగా వేయించాలని సూచించారు. వేదిక వద్ద ఉదయం 6 గంటలకు సంసిద్ధంగా ఉండాలని, ఆ దిశగా మండల ప్రత్యేక అధికారులు బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎస్.భాస్కర రావు, ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహనరావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, మున్సిపల్ కమిషనర్ సిహెచ్. వెంకటేశ్వర్లు, ఐటిడిఎ ఎపిడి ఎ.మురళీధర్, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఆర్.కృష్ణవేణి, జిల్లా బిసి సంక్షేమ శాఖాధికారి ఇ.అప్పన్న, సమగ్ర శిక్ష ఎపిసి ఆర్.తేజేశ్వరరావు, జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.రాజ్ కుమార్, కలెక్టరేట్ ఎఒ రాధా కృష్ణమూర్తి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

యోగా ఏర్పాట్లు పరిశీలన

పట్టణంలో రైల్వేస్టేషన్ పక్కన ఉన్న పార్కు, జగన్నాథపురం వీధిలో స్కూల్, దేవాంగుల వారి వీధి, చర్చి వీధిలో మున్సిపల్ పార్కు తదితర ప్రదేశాల్లో చేస్తున్న యోగా ఏర్పాట్లను కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్.. మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లతో కలిసి పరిశీలించారు. యోగాలో పాల్గొన్న వారికి తప్పనిసరిగా సర్టిఫికెట్ అందజేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ఉంటుందని, దీనిలో కూడా జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజా ప్రతినిధులు భాగస్వాములు కావాలని కోరారు.

యోగాతో ఆరోగ్యకరమైన సమాజం

పాలకొండ : మానసిక ప్రశాంతతకు, శారీరక ఆరోగ్యానికి యోగా ఎంతగానో ఉపయోగ పడుతుందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పడాల భూదేవి అన్నారు. విశాఖపట్నంలో యోగా దినోత్సవానికి పాలకొండ నియోజకవర్గం నుండి 45 మంది వాలంటీర్లను ఏర్పాటుచేశారు. శుక్రవారం వారంతా బస్సులో బయల్దేరారు. ఈ బస్సును ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ పట్టణ అధ్యక్షులు గుమ్మడి సింహాద్రి, యువ నాయకుడు చొంగ శివానంద్, కోటదుర్గ అమ్మవారి ఆలయ మాజీ చైర్మన్ శాసపు సర్వారావు, టిడిపి సీనియర్ నాయకులు బుజ్జి, దుర్గారావు, శంకర్రావు, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగులే కీలకం



పాచిపెంట.. విశ్రాంత రెవెన్యూ ఉద్యోగిని సన్మానిస్తున్న ఎంసి చైర్మన్ సూర్యనారాయణ

ప్రజాశక్తి-పాలకొండ

అన్ని శాఖల కంటే రెవెన్యూ ఉద్యోగుల కీలకమని ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ డివిజన్ గౌరవ అధ్యక్షులు ఎద్దు లిల్లీ పుష్పనాథం అన్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖలతో పనిచేయించే శాఖ కూడా రెవెన్యూ మాత్రమేనని చెప్పారు. ప్రజలకు మేలు చేయడానికి కూడా ఈ శాఖలోనే వీలు కలుగుతుందన్నారు. ఆర్‌డిఒ కార్యాలయ ఎఒ ఎం.సావిత్రి మాట్లాడుతూ అన్ని శాఖల కంటే రెవెన్యూ శాఖపై ఒత్తిడి ఉందని, అయినప్పటికీ ఈ శాఖలో గుర్తింపు కూడా లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌టిఒ భాస్కర్ రావు, ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఎం.ఎన్.వి ప్రసాద్, డిటి సన్యాసిరావు, ఎన్‌జిఒ సంఘం డివిజన్ కార్యదర్శి పైల ఈశ్వరరావు, విఆర్‌ఒల సంఘం నాయకులు భాస్కరరావు, డీలర్ల సంఘం నాయకులు సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు.


కొమరాడ : ప్రజలకు రెవెన్యూ శాఖ ద్వారా అందుతున్న సేవలు కీలకమని ఉప తహశీల్దార్ రెడ్డి ఫకీర్ అన్నారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ శంకర్రావు, మండల సర్వేయర్ వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం రెవెన్యూ డే సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి తహశీల్దార్ వి.ఉమామహేశ్వరరావు, ఎంపిడిఒ ఎంఎస్ఎల్ ఎన్ ప్రసాద్ మాట్లాడారు. అనంతరం రెవెన్యూ శాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన వారికి సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెదభోగిలి సర్పంచ్, ఉప సర్పంచ్ కె.అరవింద్ కుమార్, గ్రామ పెద్దలు ఎస్.హరి గోపాలరావు పాల్గొన్నారు.

సీతంపేట : సీతంపేట తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ డే ఘనంగా నిర్వహించారు. విశ్రాంత తహశీల్దార్ నరసింహమూర్తి, విఆర్‌ఒ కె.సూర్యనారాయణకు ఇన్‌ఛార్జి తహశీల్దార్ మల్లేశ్వరరావు, ఉపతహశీల్దార్ శ్రీవిద్య, ఆర్‌ఐ విజయ గణేష్ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ సహాయకులు శ్రీదేవి, జూనియర్ సహాయకులు హేమంత్, విఆర్‌ఒ అరుణ, జ్యోతి, రవి, ఆరుద్ర, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : అన్ని శాఖల కంటే రెవెన్యూ శాఖ కీలకమని ఇన్‌ఛార్జి తహశీల్దార్ జి.ప్రసాదరావు తెలిపారు. స్థానిక కార్యాలయంలో రెవెన్యూ డే సందర్భంగా సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు బి.బుచ్చియ్య, బి.సుందరరావు, నాయకులు ఉదయాన ఉదయ భాస్కర్, సీనియర్ సహాయకులు జి.కృష్ణ, ఎంఆర్‌ఐ ఎస్.మారుతీ రావు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

పాచిపెంట : మండల ప్రజలకు అందిస్తున్న రెవెన్యూ సేవలతో ఆ శాఖ ప్రతిష్ట



కురుపాం.. విశ్రాంత రెవెన్యూ అధికారులను సన్మానిస్తున్న డిటి సురేష్, కోటేశ్వరరావు



సీతంపేట.. విశ్రాంత ఉద్యోగులను సత్కరిస్తున్న ఇన్‌ఛార్జి తహశీల్దార్ మల్లేశ్వరరావు

మరింత పెంపొందాలని ఎంసి చైర్మన్ ముఖి సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ శాఖ అధికారులు అంకితభావంతో పనిచేయాలని దీర్ఘకాల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం విశ్రాంత రెవెన్యూ ఉద్యోగి గొట్టాపు అప్పలనాయుడుకు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ చంద్రశేఖర్, ఆర్‌ఐ రమణారావు, తిరుమలరావు, పాంచాలి సర్పంచ్ గూడెపు యుగంధర్, ఎంపిటిసి సభ్యులు దండి ఏడుకొండలు, పల్లేడ ఉమామహేశ్వరరావు, చల్ల కనక, పూసర్ల నర్సింగరావు, ఎం.బలరాం, కె.సురేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కురుపాం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద డిప్యూటీ తహశీల్దార్ సురేష్ ఆధ్వర్యంలో ఘనంగా రెవెన్యూ డే వేడుకలను నిర్వహించారు. అనంతరం విశ్రాంత రెవెన్యూ అధికారులు ఎం.గణపతిరావు, లంక రఘులను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి అంధవరపు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మక్కువ : మండలంలోని ప్రజలంతా రెవెన్యూ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌ఛార్జి తహశీల్దార్ హేమంత్ కుమార్ అన్నారు. రెవెన్యూ డేను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ వ్యవస్థ పునర్నిర్మాణం, తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, వారి సలహాలు సూచనలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కొల్లి శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కెమికల్ ఫ్యాక్టరీని మూసేయాలి

ప్రజాశక్తి-కొమరాడ

ప్రజల ప్రాణాలు తీస్తున్న కెమికల్ ఫ్యాక్టరీని వెంటనే మూసివేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని గంగిరేగువలసలో ఉన్న స్టార్ క్రాప్ ఆగ్రో కెమికల్ ఫ్యాక్టరీ పరిసర ప్రాంతాల్లో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవతో కలిసి ఆయన పర్యటించారు. 2018లో ఫ్యాక్టరీ ఏర్పాటు చేసిన తర్వాత గ్రామంలో ఫ్యాక్టరీ వ్యర్థాలు, ప్రాణాంతక వాయువులు విడుదల చేస్తుండటంతో ఇప్పటికే సుమారు పదిమంది కేన్సర్ బారినపడి చనిపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. మరో 15 మంది వరకు కేన్సర్ చికిత్స తీసుకుంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఫ్యాక్టరీ పరిసర పొలాల్లో పనిచేయడానికి కూలీలు రావడం లేదన్నారు. ఆ పరిసర ప్రాంతాల్లో రైతులు పంటలు పండించుకోవడం చాలా దుర్లభం అవుతుందని చెప్పారు. తక్షణమే కెమికల్ ఫ్యాక్టరీని నిలిపివేయాలని కోరారు. జంఝావతి రబ్బరు డ్యామ్‌కు సంబంధించిన షెడ్డులో కెమికల్ ఫ్యాక్టరీ వ్యర్థాలను, రా మెటీరియల్‌ను పడేయడంతో అక్కడికి ఎవరూ వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే వాటిని తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి వెంకటనాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గురుబిల్లి సూరయ్య, రామారావు, అల్లు శంకర్రావు, మరిశర్ల సింహాచలం నాయుడు. మరిశర్ల సత్యనారాయణ, శెట్టి శ్రీరాము, డొంకాడ హరి, కందుల దులపాటి సాయి పాల్గొన్నారు.

యోగా దినోత్సవానికి పక్కా ఏర్పాట్లు

ప్రజాశక్తి-పాలకొండ

జిల్లాలోని అన్ని సబ్‌జైళ్లలో యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా సబ్‌జైలు శాఖాధికారి కె.మోహన్ రావు తెలిపారు. శుక్రవారం స్థానిక సబ్ జైల్లో తనిఖీలు చేపట్టారు ఈ సంధర్భంగా జైలుకు సంబందించి అన్ని రికార్డులు పరిశీలించారు. స్టోర్ రూమ్, స్టాక్ రిజిస్టర్‌తో సహా అన్ని రికార్డులు పరిశీలించారు. జైల్లో ఉన్న రిమాండ్ ఖైదీల ఆరోగ్య పరిరక్షణ ముఖ్యమని, దీనిపై జైలు సూపరింటెండెంట్‌తో సహా సిబ్బంది అంతా ప్రత్యేక దృష్టి పెట్టాలని చెపారు. కార్యక్రమంలో జైల్ సూపరింటెండెంట్ బి.జోగులు, సబ్ జైలు జూనియర్ అసిస్టెంట్ జె.రామకృష్ణ, సిబ్బంది బి.విజయకుమార్, బి.నర్సింహులు, నాగరాజు, హేమసుందర్ పాల్గొన్నారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం

ప్రజాశక్తి-కొమరాడ

గిరిజన గ్రామాల్లో వైద్యం పూర్తిస్థాయిలో అందించడంలో జిల్లా స్థాయి అధికారులు నిర్లక్ష్య ధోరణి తగదని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, గిరిజన సంఘం నాయకులు హెచ్ రామారావు ఖండించారు. మండలంలోని మాదలింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సంధ్బంగా వారు మాట్లాడుతూ ఇద్దరు వైద్యులకు ఏడాది నుంచి ఒకరే విధులకు హాజరవుతున్నారని తెలిపారు. దీంతో వైద్య సేవలు సరిగా అందడం లేదని చెప్పారు. వెంటనే రెండో వైద్యుడిని నియమించాలని డిమాండ్‌చేశారు.



ఎంఇఒ సింహాచలానికి శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

గరుగుబిల్లి ఎంఇఒగా సామల

ప్రజాశక్తి - గరుగుబిల్లి

గరుగుబిల్లి మండల విద్యాశాఖ అధికారి (ఎఫ్‌ఎసి)గా సామల సింహాచలం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు పూర్వ ఎంఇఒ దత్తి అప్పలనాయుడు, ఎంఇఒ-2 కొండలరావు, సిఆర్‌ఎంటిలు, మిస్ కో ఆర్డినేటర్, ఎల్‌డిఎ, ఆఫీస్ సిబ్బంది స్వాగతం పలికారు. వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

కురుపాం జిజెసి ప్రిన్సిపల్‌గా కుమారస్వామి

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా ఎం.కుమారస్వామి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వీరఘట్టం జూనియర్ కళాశాలలో జువాలజీ అధ్యాపకులుగా ఉంటూ ఉద్యోన్నతిపై ప్రిన్సిపల్‌గా మండలానికి వచ్చారు. అనంతరం సిబ్బంది ప్రిన్సిపల్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

పశువులకు టీకాలు తప్పనిసరి

ప్రజాశక్తి - కురుపాం

వర్షాకాలంలో పశువులకు టీకాలు తప్పనిసరిగా వేయాలని వెటర్నరీ వైద్యాధికారి కె.శైలజ అన్నారు. మండలంలో గుమ్మ గ్రామంలో శుక్రవారం పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షకాలంలో పశువులకు గొంతువాపు, జబ్బవాపు, నీలినాలుక , చిటుక వ్యాధులు వస్తుంటాయని తెలిపారు. దీంతో ముందస్తుగా టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. తప్పనిసరిగా పాడి రైతులంతా పశువులకు టీకాలు వేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



గాయత్రీ కళాశాలకు నోటీసు అంటిస్తున్న పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు

అక్రమ కట్టడాలపై నోటీసు

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని నడుకూరు పంచాయతీ పరిధి శ్రీ గాయత్రీ కళాశాల ప్రాంగణాన్ని అక్రమంగా కట్టినట్లు శుక్రవారం పంచాయతీ కార్యదర్శి బి.కోటేశ్వరరావు ఆ విద్యాసంస్థ యాజమాన్యానికి నోటీసు జారీ చేశారు. సుడా అనుమతులు లేకుండా అక్రమ కట్టడాలు చేపట్టారని, ఇందు నిమిత్తం నోటీసు జారీ చేశామని ఆయన తెలిపారు.

విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని మొండెంఖల్ గ్రామంలో శుక్రవారం రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన సర్పంచ్ ఐ.గౌరీశంకర్ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్‌పి మాజీ కోఆప్షన్ సభ్యులు రంజిత్ కుమార్ నాయక్, మాజీ ఎంపిటిసి జి.విద్యారాణి, వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

28న వీరఘట్టం మండల సమావేశం

ప్రజాశక్తి-వీరఘట్టం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఈ నెల 28న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ బి.వెంకటరమణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపిటిసిలు, మండల స్థాయి అధికారులు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



గరుగుబిల్లి.. నినాదాలు చేస్తున్న సిఐటియు నాయకులు, స్కీమ్‌వర్కర్లు

ప్రజాశక్తి-సీతంపేట

జులై 9న చేపట్టే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు కోరారు. సార్వత్రిక సమ్మె జయప్రదానికి శుక్రవారం సీతంపేటలో వివిధ రంగాల కార్మికులతో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎస్.లక్ష్మి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో లేబర్ కోడ్లను ప్రవేశపెట్టడం ద్వారా కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం హరిస్తోందని విమర్శించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన నిర్వాహకులకు కనీస వేతనాలు చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజనులు, రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, గ్రామీణ వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీని పూర్తిస్థాయిలో అమలుచేయాలని కోరారు. పని గంటల పెంపు నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌చేశారు. సమ్మె జయప్రదానికి సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీపుయాత్ర 25న సీతంపేట వస్తుందని తెలిపారు. అందులో కార్మికులంతా పాల్గొని, జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమ్మె కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పి.రమాదేవి, ఎస్.సంతోషి, బి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : సార్వత్రిక సమ్మె జయప్రదానికి గరుగుబిల్లిలో వివిధ రంగాల కార్మికులతో చింతాడ గౌరమ్మ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలను కేంద్రం అవలంబిస్తోందని, దీనిపై చేపట్టే సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు డి.వెంకట నాయుడు, బాబురావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు సావిత్రి, కృష్ణవేణి, అరుణకుమారి, స్వాతి, గ్రీన్ అంబాసిడర్స్ యూనియన్ నాయకులు సామంతుల అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



సీతంపేట.. సమ్మె కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు



కాలిపోయిన స్మార్ట్‌మీటర్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

కాలిపోయిన స్మార్ట్ మీటర్

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పార్వతీపురం పట్టణంలో ఇటీవల బిగించిన స్మార్ట్‌మీటర్ కాలిపోయింది. పట్టణ శివారు రాయగడ రోడ్డు సమీపంలో మెకానిక్ షాపునకు ఇటీవల బలవంతంగా స్మార్ట్‌మీటర్ ఏర్పాటు చేశారు. ఈ స్మార్ట్‌మీటర్ గురువారం రాత్రి కాలిపోయింది. ఈ ప్రాంతాన్ని శుక్రవారం సిపిఎం జిల్లా నాయకులు బి.వి.రమణ, గొర్లి వెంకటరమణ పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో ప్రతిపక్ష హోదాలో ఉన్నప్పుడు అదానీ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన టిడిపి కూటమి నేతలు.. ఇప్పుడు అవే స్మార్ట్ మీటర్లను బలవంతంగా ప్రజలకు అంటగట్టడం దుర్మార్గమైన చర్యని విమర్శించారు. ఈ స్మార్ట్‌మీటర్లు ప్రజలకు ఏ రకంగానూ మేలు చేయవని, వీటి వల్ల ఇప్పటికే విద్యుత్తు బిల్లులు అధికంగా వస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ మీటర్లు అత్యంత నాసిరకంగా ఉన్నాయని, అనేక ప్రమాదాలకు కారణం అవుతున్నాయని తమ పరిశీలనలో తేలిందన్నారు. ఇప్పటికైనా ప్రజల ప్రయోజనాలను గుర్తించి అదాని స్మార్ట్ మీటర్లను బిగించే ప్రక్రియను నిలుపు చేయాలని డిమాండ్‌చేశారు. కాలిపోయిన స్మార్ట్‌మీటర్ స్థానంలో ఉచితంగా పాత మీటర్లు ఇవ్వాలని, జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలని విద్యుత్తు శాఖ అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు, సంచాన ఉమామహేశ్వరరావు, సిఐటియు నాయకులు సతీష్, డి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సాఫీగా సాగిన మండల సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఎంపిపి, జెడ్‌పిటిసి, ప్రత్యేక ఆహ్వానితులు

ప్రజాశక్తి-పాలకొండ

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం ఎంపిపి బొమ్మల భాను అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం సాఫీగా సాగింది. మండల ప్రత్యేక ఆహ్వానితులు కె.అప్పల నాయుడు, జాడ శ్రీధర్ శాఖలపై క్షుణ్ణంగా సమీక్షించారు. అధికార, ప్రతిపక్ష నాయకుల మధ్య సామరస్య వాతావరణంలోనే మాటలు యుద్ధం సాగింది. అంపిలి గ్రామానికి చెందిన వైసిపి సర్పంచ్ లోలుగు విశ్వేశ్వరరావు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శి పూర్తిగా పట్టించుకోవడం లేదని, ఇటీవల రేషన్ డిపోల ప్రారంభానికి కూడా తనను పిలవలేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. గ్రీన్ అంబాసిడర్ నియమించే విషయంలో తన ప్రమేయం లేదని అధికారులను నిలదీశారు. ప్రత్యేక ఆహ్వానితులు జాడ శ్రీధర్, అప్పలనాయుడు మాట్లాడుతూ గ్రామంలో సర్పంచ్ కచ్చితంగా కీలకమని, పంచాయతీ కార్యదర్శి కూడా సర్పంచ్‌కు తెలియకుండా ఏ పనీ చేయకూడదని స్పష్టంచేశారు. ఈ విషయంలో ఎంపిడిఒ వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని, అభివృద్ధి అడ్డుకాకుండా పంచాయతీ తీర్మానాలు ఇవ్వాలని వారన్నారు. కోటిపల్లిలో కనీసం బోర్లు మంజూరుకు కూడా తీర్మానాలు ఇవ్వలేదని అప్పలనాయుడు, శ్రీధర్ అన్నారు. ఎంపిపి చేసిన తీర్మానాన్ని గౌరవించాల్సిన అవసరం లేదా? అంటూ ప్రశ్నించారు. దానిపై వైసిపికి చెందిన వైస్ ఎంపిపి కనపాక సూర్యప్రకాశ్ మాట్లాడుతూ ఎంపిపి తీర్మానాలను గౌరవిస్తామని, అయితే గ్రామాల్లో ప్రజలతో ఎన్నికైన ఎంటిపిసిలకు కూడా గౌరవం ఇవ్వాలని సూచించారు. ఇరిగేషన్ శాఖపై జరిగిన చర్చలో కచ్చితంగా ఖరీఫ్‌కు నీరందించాలని పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు అధికారులను నిలదీశారు. వెలుగుపై చర్చలో గ్రామాల్లో కానీ సర్పంచులకు, ఎంపిటిసిలకు ఏ కార్యక్రమం జరుగుతుందో తెలియడం లేదని, ఇది సరికాదని అప్పలనాయుడు, శ్రీధర్ అన్నారు. వ్యవసాయ శాఖపై చర్చలో వ్యవసాయ పనిముట్లు వివరాలు సభ్యులకు తెలియజేయాల్సిన బాధ్యత లేదా? అంటూ అప్పలనాయుడు.. మండల వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద్‌ను ప్రశ్నించారు. ఉద్యానవన శాఖ, ఐసిడిఎస్, తదితర శాఖలపై క్షుణ్ణంగా సమీక్షించారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి సభ్యురాలు గౌరీ పార్వతి, వైస్ ఎంపిపి వి.అనిల్, ఎంపిడిఒ విజయ రంగారావు పాల్గొన్నారు.

కాలువలకు మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి-బలిజిపేట



కాలువను పరిశీలిస్తున్న ఎపి రైతుసంఘం, ప్రజా సంఘాల నాయకులు

తోటపల్లి, పెదంకలాం కాలువలకు మరమ్మతులు చేపట్టాలని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు, గేదెల సత్యనారాయణ, ప్రజా సంఘాల నాయకులు గంట్యాడ బలరామ నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తోటపల్లి, పెదంకలాం కాలువలను శుక్రవారం వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ తోటపల్లి కుడి కాలువ నుంచి ఏగోటివలస, గాదెలవలస, సుభద్ర, పనుకోవలస, శివరాంపురం, చెల్లింపేట, అరసాడ, వెంగపురం, మిర్తివలస గ్రామాల పరిధిలో సుమారు 1500 ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యంతో కాలువ పనులు ప్రారంభించారని తెలిపారు. కొంతకాలంగా ఈ పనులు నిలిపివేశారని చెప్పారు. శివరాంపురం వద్ద ఉన్న ఏడు చెరువుల్లో కలుపుకొని కాలువ తవ్వితే రైతులకు ఉపయోగమని తెలిపారు. అలా కాకుండా ఒక భూస్వామి భూములకు నీరు అందించడం కోసం కాలువను ఏడు మెలికలు తిప్పడం మంచిది కాదన్నారు. పెదంకలాం కాలువ సుమారు 9 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలన్నారు. జైకా నిధులు వచ్చినప్పటికీ అసంపూర్తిగా పనులు ప్రారంభించి, నిధులు ఏమయ్యాయో? ఎక్కడ ఖర్చు పెట్టారో? తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ప్రధాన కాలువలో గండ్లు పూడ్చి, సెక్టార్లు బాగు చేసి, కాలువలో పూడికలు తీయాల్సి ఉందని చెప్పారు. వెంటనే ఈ సమస్యలను పరిష్కరించి, రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు వై.మన్మథరావు, నాయుడు, అప్పయ్య, గోపాలకృష్ణ, రామారావు, తదితరులు పాల్గొన్నారు.



ఎంఇఒకు వినతి అందిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ప్రయివేట్ పాఠశాలలపై
చర్యలు తీసుకోవాలని వినతి

ప్రజాశక్తి-వీరఘట్టం

తప్పుడు ప్రచారాలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెడుతున్న ప్రయివేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎంఆర్‌సి భవనంలో మండల విద్యాశాఖ అధికారులు డి.గౌరినాయుడు, ఆనందరావుకు వినతిపత్రం అందజేశారు. అర్హత లేని ఉపాధ్యాయులను నియమిస్తున్నారని, ఇరుకైన గదుల్లో విద్యను కొనసాగిస్తున్నారని తెలిపారు. కనీస మౌలిక సదుపాయాలు లేవని, విశ్రాంతి సమయంలో పిల్లలు ఆడుకునేందుకు క్రీడా స్థలాలు కూడా లేవని వివరించారు. వీటన్నిటిపై క్షుణ్ణంగా పరిశీలించి, చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎం.పైడిరాజు, ఎ.సూర్యనారాయణ, ఎం.నరహరి, కె.గోవిందరావు, బి.దుర్గాప్రసాద్, ఆర్.ధనుంజయ నాయుడు, బి.అప్పలనాయుడు, ఎన్.విజయ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై పిఎసిఎస్ సిబ్బంది ధర్నా

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్



ధర్నా చేస్తున్న పిఎసిఎస్ సిబ్బంది

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లాలోని పిఎసిఎస్‌ల సిబ్బంది శుక్రవారం స్థానిక డిసిసిబి కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఆర్‌విఎస్ కుమార్, ఉమ్మడి జిల్లాల పిఎసిఎస్ ఉద్యోగుల సంఘ అధ్యక్షులు ఆర్.సత్యారావు మాట్లాడుతూ జిల్లాలోని పిఎసిఎస్ ఉద్యోగుల జీతాలకు బదులుగా అడ్వాన్సులు ఇవ్వడం దారుణమన్నారు. పెండింగ్ లో ఉన్న జీతాలను తక్షణమే చెల్లించాలన్నారు. జిల్లా సహకార సంఘ అధికారి ఉద్యోగుల పట్ల కఠిన వైఖరి అవలంబిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు జి.పాండురంగారావు, సిరిపురపు నారాయణరావు, హరీష్, పి.నాగభూషణరావు, గొర్లి చంటి, తదితరులు పాల్గొన్నారు.

డిఎ జుగాతో గిరిజనుల అభివృద్ధి

కొమరాడ : డిఎ జుగా కార్యక్రమంతో గిరిజనుల అభివృద్ధి సాధ్యమవుతుందని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎస్.రమేష్ అన్నారు. మండలంలోని కెమిశిల, తులసివలస గ్రామాల్లో డిఎ జుగా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గిరిజనులకు అందుతున్న పథకాలు సేవలను వివరించారు. విద్యార్థులకు అవసరమైన ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనారోగ్యంగా ఉన్న పలువురు గిరిజనులకు మలేరియా నిర్ధారణతో పాటు వివిధ రకాల పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగాధర్, హౌసింగ్ ఎఇ రాములు, ఎపిఎం సురేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.